www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 10 సెప్టెంబర్ 2024
5
చిత్తూరు

ఊపందుకోనున్న సూక్ష్మ సేద్యం

- 21 వేల హెక్టర్లలో బిందు, తుంపర సేద్యం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సూక్ష్మ సేద్యానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో సూక్ష్మసేద్యం పరికారాలు అమర్చుకొనేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో 21 వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం పరికాల కోసం రైతులు రిజిస్టేషన్లు చేసుకోవాలని పిలుపుతో జిల్లా వ్యాప్తంగా రైతుల్లో కదలిక వచ్చింది. గత ఐదు సంవత్సరాలుగా బిందు, తుంపర్ల సేద్యం పరికరాల కోసం ఎదురు చూస్తున్న రైతులు ప్రభుత్వ నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తూ ఉమ్మడి చిత్తూరులో బిందు, తుంపర్ల సేద్యం పరికాల కోసం 12 వేలకు పైగా రైతులు రిజిస్టేషన్లు చేసుకున్నట్లు సమాచారం. ఐదేళ్ళపాటు బిందు, తుంపర్ల సేద్యం పరికారాలు సరఫరా చేసే కంపెనీలు మూతపడ్డాయి. ప్రభుత్వ నిర్ణయంతో కంపెనీలు రైతులకు పరికరాలు సరఫరా చేసేందుకు ముందుకు వస్తున్నాయి. పాత బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తామంటూ హామీ ఇవ్వడంతో కంపెనీలు పరికరాలను సరఫరా చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 21వేల హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం కిందకు తీసుకురావాలని ఉద్యానశాఖ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఇందులో రైతులకు 30 కోట్లుకు పైగా రాయితీపై ఇవ్వనున్నారు. ఇందులో కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం వాటా 40 శాతం నిధులు సమకూరుస్తుంది.

ప్రయోజనాలు..

సూక్ష్మసేద్య విధానంలో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించడానికి వీలుపడుతుంది. విద్యుత్తు, ఎరువులు ఆదా అవుతాయి. కూలీల ఖర్చు, కలుపు మొక్కల సమస్య తక్కువగా ఉంటుంది. ఎగుడు, దిగుడ నెలల్లోనూ సాగు చేయడానికి అనుకూలం. మొక్కకు కావాల్సిన నీరు అందుతుంది. బిందు, తుంపర సేద్యానికి రాయితీపై పరికరాలు పొందడానికి రైతులు ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రం నకళ్ళు జత చేసి రైతు సేవా కేంద్రాలు, మండల ఉపానాధికారి, సూక్ష్మ నీటి పారుదల అధికారి, జిల్లా మైక్రో ఇరిగేషన్ కార్యాలయాల్లో బయోమెట్రిక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలి. బోర్లు, బావుల కింద వ్యవసాయం చేసే రైతులకు ఇది ఉపయోగకరం.

బిందు సేద్యం ఏఏ పంటలకంటే...

కొబ్బరి, అయిల్‌ఫామ్, జామ, మామిడి పూలతోటలు, చెరకు, మిరప ఇతర కూరగాయల పంటలు ఐదు ఎకరాల లోపు పొలం ఉన్న చిన్న సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై రూ. 2.18 లక్షలు అందించనున్నారు. 5 ఎకరాల నుంచి 12.50 ఎకరాల వరకు భూమి ఉన్న ఇతర రైతులకు రూ. 3.10 లక్షల వరకు 50శాతం రాయితీపై పొందవచ్చు.

మొక్కజొన్న పంటసాగును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో మెట్టప్రాంతం ఎక్కువ ఉమ్మడి జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2,48,469 హెకార్టు కాకాగా సాగు విస్తీర్ణం 1,36,903 ఉంది. జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో వేరుశనగ విస్తీర్ణం అధికం వేరునగకు తుంపర సేద్యం అనుకూలం, కూరగాయలు, మామిడి, ఇతర పంటలకు బిందుసేద్యం పరికరాలు అమర్చుకోవచ్చు. ప్రభుత్వం బిందు, తుంపర సేద్య విస్తీర్ణం పెంపు కోసం రైతులకు అందిస్తున్న ప్రోత్సహాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి

తుంపరసేద్యం వర్తించే పంటలు...

పెసర, మినుము, వేరుసెనగ పంటలకు అందిస్తారు. ఐదెకరాలోపు పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం రాయితీపై అందిస్తారు. ఐదు నుంచి 12.50 ఎకరాల భూమి కలిగిన ఇతర రైతులకు 45 శాతం రాయితీపై తుంపర సేద్యం పరికరాలు అందిస్తారు.

అర్థాకలితో గ్రీన్ అంబాసిడర్లు

- రెండేళ్లుగా అందని జీతాలు
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్

రోడ్డుపై మురుగు నీటిని శుభ్రం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

ప్రజాశక్తి- విజయపురం

గ్రీన్ అంబాసిడర్లను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. దీంతో వారు జీతాల్లేక అర్థాకలితో అలమటిస్తున్నారు. చెత్తాచెదారం తీసేసి గ్రామాన్ని శుభ్రపరుస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు దాదాపు రెండేళ్లుగా జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం, అంటువ్యాధులు, సీజనల్ జర్వాలు ప్రబలుతున్న నేపథ్యంలో జీతాల్లేక, కుటుంబాలను పస్తులుంచలేక కొన్ని గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు పనులు మానేశారు. దీంతో మురుగు కాలువల్లో చెత్తాచెదారం నిండి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల భారిన పడుతున్నారు.

15 ఆర్థిక నిధులు రూ. 40లక్షలు

మండలంలో మొత్తం 25 పంచాయతీలు, 12 సచివాలయం, 16 మంది పంచాయతీ కార్యదర్శులు, 59 మంది గ్రీన్ అంబాసిడర్లు పనిచేస్తున్నారు. గతనెల 15 ఆర్థిక నిధులు ఒక్కో పంచాయతీకి రూ.లక్ష నుంచి మూడు లక్షల వరకు సుమారు మొత్తం 40లక్షల వచ్చింది. అందులో నుంచి గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లు అదేశించిన వాటిని అధికారులు లెక్క చేయడం లేదు. తమకు జీతాలు ఇవ్వండి మహాప్రభు.. అంటూ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా.. ఎవ్వరు పట్టించుకోవడం లేదని గ్రీన్ అంబాసిడర్లు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీకి వచ్చే నిధులను పని చేయకుండా ఎం బుక్‌లు రెడీ చేసి నిధులను కాచేయడానికి అధికారులు, సర్పంచ్‌లు సిద్ధమవుతున్నారని ఆరోపణ గట్టిగా వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు స్పందించి వెంటనే గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకొని కార్యదర్శి, సర్పంచ్

గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్లను నియమించి ఒక్కొక్కరికి రూ.6వేలు నెల జీతం ఇస్తోంది. 200 ఇళ్లకు ఒక అంబాసిడర్‌ను కేటాయించి తడి, పొడి వ్యర్థాల సేకరణ, నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పింది. ఈ మేరకు గ్రీన్ అంబాసిడర్లు తడి చెత్త, కుళ్లిన పండ్లు, ఆకులు, కూరగాయలు.. పొడి చెత్త కింద కాగితాలు, ఇతర పేపర్లు, వాటర్ బాటిళ్లు, చెక్కలు మొదలైనవి ఇంటింటికి తిరిగి సేకరించి సంపద షెడ్డుకు తరలిస్తున్నారు. అయితే రెండేళ్లుగా వేతనాలు అందించలేదు. ఎవరూ చేయలేని చెత్తా చెదారం సేకరణ, పేడ, మురికినీటిని తీసివేసే గ్రీన్ అంబాసిడర్లకు మాత్రం సకాలంలో జీతాలు చెల్లించడం లేదు. జీతాలు లేక కొంత మంది గ్రీన్ అంబాసిడర్లు నగరి నియోజకవర్గాల్లోని వివిధ మండలాల్లో పనులు మానేసి వేరే పనులు చూసుకుంటున్నారు. ఎప్పటికైనా జీతాలు రాకపోతాయా.. మా కడుపులు నిండుతాయా అన్న ఎదురు చూపుతో కొంత మంది గ్రీన్ అంబాసిడర్లు పని చేస్తూనే ఉన్నారు.

రుచికరమైన, నాణ్యమైన

పౌష్టికాహారం అందించండి: కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలులో మెనూ మార్పులపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యుల నుంచి మెనూ మార్పు పట్ల సలహాలు, సూచనలు రెండు రోజుల్లోపు సేకరించాలని తెలిపారు. ఈ కసరత్తును పకడ్బందీగా ప్రాధాన్యతగా భావించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని వెల్లడించారు. ఈ సమావేశంలో డీఈఓ దేవరాజు, ఏపీసీ వెంకటరమణారెడ్డి, ఎంఈఓలు, హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికనూ వదలడం లేదు..

భూ కబ్జాను ఆపాలని యానాదుల ఆవేదన

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అగ్రవర్ణాల వారికి గిరిజన శ్మశాన వాటికలను పట్టాలు పంపిణీ చేస్తున్నారని యానాదులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని మొగిలి గ్రామం రెవెన్యూలోని యానాదులు మండల శ్మశాన వాటికను కాపాడాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మొగిలి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 61లోని ఊరగుట్ట భూమిని ఏళ్ళ తరబడి గ్రామంకు చెందిన గిరిజన (యానాదులు) కుటుంబాలు మేకలు, గొర్రెలు మేపుకొంటు, ఆ భూముల్లో సాగు చేసుకుంటూ, అటవీ పలసాయాన్ని సేకరించుకుని ఆదాయంతో జీవనం సాగించుకుంటున్నామని తెలిపారు. ఆభూమిలోనే కొంత భాగాన్ని శ్మశానంగా కూడా వినియోగించుకుంటున్నామని తెలిపారు. తమ అనుభవంలో ఉన్న భూమికి పట్టా మంజూరు కోసం పలు మార్లు రెవెన్యూ అధికారులను సంప్రదించామని, కానీ అధికారుల నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో అధికారులను ప్రశ్నించగా ఆ భూమిపై ఎవరికీ పట్టాలు ఇవ్వమని మమ్మల్ని మభ్యపెట్టి సదరు రెవెన్యూ గ్రామంలోని దొరచెరువులో కాపురముంటున్న అగ్రకులస్తుడు పెద్దబ్బ నాయుడు కుమారుడు ఏకాంబరం నాయుడు అనే భూస్వామి పేరిట, అతని కుటుంబ సభ్యుల పేరిట వేరే ప్రాంతంలో నివాసముంటున్న బంధువులు పేరిట సదరు సర్వే నెంబర్ 61లో సుమారుగా 15 నుంచి 20 ఎకరాలు భూమికి, ఇంకొంతమంది భూస్వాములకు తమ అనుభవంలో ఉన్న భూమిని రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఏకాంబరం నాయుడు, అతని కుటుంబ సభ్యులు ఇదివరకే అర్హతకు మించి డికెటి పట్టాలు పొంది ఉన్నారని, గతంలో తహసిల్దార్‌కు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజినల్ అధికారికి ఈ శ్మశాన భూమిపై పట్టాలు ఇవ్వరాదని అభ్యతరం తెలుపుతూ వినతిపత్రం సమర్పించామని గుర్తు చేశారు. అయితే ఈనెల 7వ తేదీ శనివారం ఏకాంబరం నాయుడు అతని అనుచరులు ఊరి గుట్టలోని యానాదులు శ్మశానవాటికలో బోరువేసి దౌర్జన్యంగా విద్యుత్ పోల్ నాటి పైపు లైన్లు వేస్తుండగా తాము అడ్డుకోవడంతో మమ్మల్ని కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యం చేశాడని, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిపివేసి, మళ్లీ సాయంత్రం పైప్ లైన్లు దౌర్జన్యంగా వేశాడని తెలిపారు. అధికారులు స్పందించి భూకబ్జాలకు పాల్పడుతున్న అతనిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. రాజశేఖర్, రెడ్డెమ్మ, నిర్మల, రామచంద్ర, కమల, సురేష్, పొట్టెమ్మ, గోవిందయ్య, భాను రామరాజు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న యానాదులు

యానాదుల భూములను వారికే కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్

బంగారుపాళ్యం మండలంలోని మొగిలి గ్రామంలోని యానాదుల భూములను అగ్రకులాలకు చెందిన ఏకాంబరం నాయుడు ఆక్రమించుకోవడమే కాకుండా వారి పై దౌర్జన్యం చేయడం దారుణమని, వారికి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ మొగిలి గ్రామ రెవెన్యూలో సర్వేనెంబర్ 61లోని ఊరగుట్ట భూమిని అనేక సంవత్సరాలుగా యానాదులు అనుభవంలో ఉందని శ్మశానం కూడా ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఆ భూమిని అగ్రకులస్తులకు పట్టలు ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తున్నారని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఇదే భూమిపై గిరిజనులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఈ భూమిలో ఇతరులు ఎవరు ప్రవేశించకూడదని యానాదుల అనుభవంలో ఉందని తెలిపారు. అగ్రకులస్తుడైన ఏకాంబరం నాయుడు బోరు వేసి కరెంటు పోల్ నాటే ప్రయత్నం ఆక్రమంగా చేపట్టారని, అడ్డుకున్న వారిపై దౌర్జన్యం చేశారన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా తాత్కాలికంగా పనులు నిలిపివేసి మళ్లీ పనులు కొనసాగించి వారిపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి యానాదులుకు రక్షణ కల్పించి వారి భూములకు వారికి కేటాయించాలని దౌర్జన్యం చేసిన అగ్రకలస్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులంపేరుతో దూషించి దాడులకు పాల్పడిన ఏకాంబరం నాయుడు పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. లేని పక్షంలో యానాదులకు అండగా నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గణేష్ నిమజ్జనానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- వీకోట: మండలంలో ప్రశాంతంగా గణేష్ నిమజ్జనానికి సహకరించిన ప్రజలందరికీ జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు కృతజ్ఞతలు తెలియజేశారు. మండల కేంద్రమైన వీకోటలో సోమవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని వారు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పట్టణంలో నిమర్జనానికి వెళుతున్న గణనాథులను సక్రంగా వెళ్లే విధంగా చూడాలని అధికారులకు సూచనలు ఇస్తూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జామియా మసీద్ సమీపంలో పీస్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై ఇటీవల మండలంలో చోటు చేసుకున్న సంఘటనలు కాకుండా నిమజ్జన కార్యక్రమం సక్రంగా నిర్వహించేందుకు కృషి చేసినందుకు ప్రత్యేకంగా వారిని అభినందించారు. ఇటీవల ఘర్షణ జరిగిన మసీద్ సమీపంలోకి వినాయక విగ్రహాలు రావడంతో స్థానిక ముస్లిం పెద్దలు, యువకులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా ముస్లిం యువకులు నిమజ్జన వాహనాన్ని నడిపి తమ సంఘీభావం తెలియజేశారు. అనంతరం పత్రపల్లిచెరువు సమీపంలో ఏర్పాటు చేసిన నిమర్జనం స్థలంలో అన్ని విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్పీ నిమజ్జన స్థలాన్ని స్వయంగా పరిశీలించి గ్రామపంచాయతీ , పోలీసులకు తగు సూచనలు చేశారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీఎస్పీ ప్రభాకర్, అఖిలపక్షం నేతలు రామచంద్ర నాయుడు, రంగనాథ్, పిఎన్ నాగరాజు, విజయ్, అక్మల్, అఖిల్, ఇక్బాల్, రామచంద్రుడు, దామోదర్ రెడ్డి , రఘుపతి పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ

ఘనంగా గణపతి నిమజ్జనం

వెదురుకుప్పం: మండలంలోని ఆళ్ళమడుగు గ్రామాలలో వినాయకచవితి వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం వినాయక స్వామి నిమజ్జం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మండల సొసైటీ చైర్మన్ కామసాని లోకనాథ్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ సమిరెడ్డి ధనంజయలురెడ్డి, యువకులు, పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయపురం: మండలంలో సోమవారం వినాయకుడు నిమజ్జనం వైభవంగా జరిగింది. మండలంలోని పన్నూరు సబ్ స్టేషన్, మహారాజపురం, కోసలనగరం, విజయపురంలో అన్నదానం, నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. ఇల్లత్తూరు సర్పంచ్ దిప్తగోపి, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్ రాజు, మురళి రాజు, సుబ్రమణ్య రాజు, అయ్యప్ప, కేశవులు, సురేష్ పాల్గొన్నారు.

సోమల: వినాయక చవితి పండుగ సందర్భంగా సోమల మండలం ఇరికిపెంట బంగ్లా వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం మూడవరోజు ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం నిమజ్జనం బయలుదేరు ముందు వెండి నాణెం గణపతి చేతిలోని లడ్డు వేలంపాట నిర్వహించారు. రెడ్డి ప్రసాద్ వెండి నాణెం ఒక లక్ష 7 వేల 100 రూపాయలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. మరొక వెండి నాణెం శివయ్య నాయుడు 60 వేల రూపాయలకు దక్కించుకున్నారు. వినాయకుడి చేతిలో ఉంచిన లడ్డూను నాగార్జున నాయుడు 12 వేల రూపాయలకు వేలంపాటలు దక్కించుకున్నట్టు తెలిపారు.

రామకుప్పం: వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను మూడవరోజు కోలాహలంగా చెరువుల్లో నిమజ్జనం చేపట్టారు. సోమవారం యువకులు రంగోలి పూసుకొని మేళ తాళాలతో, మంగళ వాయిద్యాల నడుమ యువకుల కేరింతలతో గణపతి బప్పా మోరియా అంటూ వినాయక విగ్రహాలు నిమజ్జనం చేశారు. మండల కేంద్రమైన రామకుప్పంలో భారీ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి చెరువుల్లో వదిలిపెట్టారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహానికి గ్రామస్తులందరూ కలిసి పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. అనంతరం బైరెడ్డిపల్లి పెద్దచెరువులో వినాయక నిమజ్జనం నిర్వహించారు. గ్రామ యూత్ లీడర్ శివశంకర్ రెడ్డి, అశోక్ కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్టలో యువత ఆధ్వర్యంలో బాణాసంచాల పేలుస్తూ మంగళ వాయిద్యాల నడుమ నిమజ్జనం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఊరేగింపులో ఘర్షణ

విజయపురం: మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద వినాయకుని ఉత్సవంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరగింది. ఈ సంఘటనలో పన్నూరు దళితవాడలకు చెందిన వీరా (25) వేలాయుధం తీవ్ర గాయపడ్డాడు. వీరు నగిరి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉంది. పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవంలో ఒక వర్గం అన్నదానం చేశారు. పన్నూరు చెందిన మరో వర్గం తమకు కూడా అన్నం పెట్టాలని కోరారు. కొంత సేపు ఆగితే ఇస్తామని చెప్పగా తమకు త్వరగా పెట్టండి అని చెప్పడంలో మాట మాట పెరిగి ఇరు వర్గాలు ఘర్షణ పడినట్లు ఎఎస్ఐ గోవిందరాజులు తెలిపారు. ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేతనాలు అందేనా.. వెతలు తీరేనా..?

ప్రజాశక్తి- కుప్పం టౌన్

గత 14 నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్న ద్రావిడ విశ్వవిద్యాలయ తాత్కాలిక సిబ్బంది తమ వెతలు ఎప్పటికి తీరుతాయా..? అని ఎదురుచూస్తున్నారు. సంవత్సరకాలం పైగా జీతాలు లేకపోవడంతో ఇప్పటికే తాత్కాలిక సిబ్బంది బతుకుభారమై, జీవనోపాధి కోసం విశ్వవిద్యాలయ ఉద్యోగాలను వదిలిపెట్టి కూలి పనులకు వెళుతున్నారు. విశ్వవిద్యాలయ మనుగడలో ముఖ్యభూమిక పోషించే తాత్కాలిక సిబ్బంది కష్టాలను గుర్తించి, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు నేటికైనా తాత్కాలిక సిబ్బందికి బకాయిపడ్డ వేతనాలను చెల్లించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా గత శుక్రవారం విశ్వవిద్యాలయ తాత్కాలిక సిబ్బందిగా పనిచేస్తున్న రామకృష్ణ ఆత్మహత్యకు ప్రయత్నించడం స్థానికంగా దుమారం లేపింది. సమాచారం అందుకున్న విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు స్థానిక పిఇఎస్ ఆసుపత్రికి చేరుకుని బాధితున్ని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ వైద్యులను సంప్రదించి బాధితుని ఆరోగ్య పరిస్థితిపై విచారించారు. జరిగిన ఘటనపై విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు స్పందిస్తూ బాధిత రామకృష్ణ చాలా కాలం నుండి ఈ సంవత్సరం మార్చినెల వరకు విశ్వవిద్యాలయ పరిధిలో తాత్కాలిక సిబ్బందిగా పనిచేశారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న పరిణామాల కారణంగా సుమారు సంవత్సర కాలంపైగా విశ్వవిద్యాలయ పరిధిలో తాత్కాలిక సిబ్బందికి వేతనాలు అందించలేదని, ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో తాత్కాలిక సిబ్బందికి బకాయిపడ్డ వేతనాలను అందించడానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇప్పటికే సంబంధిత దస్త్రాలను ఆర్థికశాఖ అధికారులకు పంపడం జరిగిందని, ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే తాత్కాలిక సిబ్బందికి వేతనాలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఈలోపు రామకృష్ణ ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆర్థికంగా వారిని ఆదుకోవడానికి మానవతా దృక్పథంతో బాధితునికి బకాయి పడ్డ వేతనాన్ని విశ్వవిద్యాలయ నిధుల నుండి వెంటనే చెల్లించడం జరిగిందన్నారు. అలాగే బాధితుని వైద్య చికిత్స నిమిత్తం ఆర్థికంగా సైతం వారికి తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

స్త్రీశిశు సంక్షేమశాఖ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలు, మినీ వర్కర్లు, హెల్పర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త పోస్టులు 6, మినీ కార్యకర్త పోస్టులు 12, హెల్పర్ పోస్టులు 37 మొత్తం 55 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఖాళీపోస్టుల వివరాల రోస్టర్ పద్ధతిలో ఆయా అంగన్వాడీ సీడిపివో కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 12వతేది నుండీ 21వ తేది సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం సంబందిత సీడిపీవో కార్యాలయాలను సంప్రదించాలని పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు...?

కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మెన్ తులసిరెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడస్తోందని సూపర్ సిక్స్‌లో ఎన్‌టిఆర్ భరోసా ఫించన్లు మినహా మిగిలిగిన ఐదు పథకాలు అమలు కాలేదని ఎప్పటిలోగా అమలు చేస్తారో కూటమి ప్రభుత్వ నాయకులు స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మెన్ తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో ఎప్పుడూ లేని విధంగా వరదలు సంభవించడంతో వేలాది మంది ప్రజలు సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మారారని దీన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా గుర్తించి తక్షణ సాయం ఏడువేల కోట్లు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి వైసిపి వైపల్యాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలను నమ్మి ప్రజలు ఓట్లు వేసిన విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మూడు నెలల కాలంలో పింఛన్ పెంపు మాత్రమే అమలు చేశారని మిగిలిన ఐదు పథకాలు ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టం చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగాని భాస్కర్, నగర అధ్యక్షులు టికే రాయల్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన ఎంఎల్‌ఏ

విద్యార్థిని రోషిణిని అభినందిస్తున్న ఎంఎల్‌ఏ గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పదవ తరగతి పరీక్షలలో 600 మార్కులకు గాను 596 మార్కులతో ఉత్తమ ప్రతిమ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రశంసలు అందుకున్న చిత్తూరు నగరానికి చెందిన విద్యార్థిని విఎన్. రోషిణిని చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్మోహన్ అందించారు. ఆ విద్యార్థిని ఉన్నత చదువులు కొరకు జిజేయం చారిటబుల్ ఫౌండేషన్ తరుపున రూ.10వేలు విరాళంగా అందించారు.

జూనియర్ కళాశాలలో

ఓపెన్ స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి- ఐరాల: పూతలపట్టు నియోజకవర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఐరాలలో సోమవారం ఎంఈఓలు రుశేంద్రబాబు, దామోదర్ నాయుడు, ప్రిన్సిపాల్ పి. రెడ్డి రామరాజు ఓపెన్ స్కూల్ (దూర విద్య విధానం)ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐరాల జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వారా విద్యా విధానంపై అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ ఈ ఓపెన్ స్కూల్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువు కోవడానికి అర్హతలు, చదువుకు దూరమైన వారికి, బడి మధ్యలో మానేసిన వారికి ఎస్–ఎస్‌సిలో ఫెయిల్ అయిన వారికి, 14 సంవత్సరాల నుంచి చదవగలిగిన రాయగలిగిన పరిజ్ఞానం కలిగి ఎటువంటి విద్యార్హతలు లేనప్పటికీ ఆగస్టు 31, 2024 నాటికి 14 సంవత్సరాలు నిండిన వారందరూ అర్హులే అని తెలిపారు. గరిష్ట వయోపరిమితి లేదని తెలిపారు. ప్రవేశం పొందిన తరువాత ఐదు సంవత్సరాలలో తొమ్మిది సార్లు పరీక్ష రాసే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ రుసుం అందరికీ వంద రూపాయలు, అడ్మిషన్ ఫీజు జనరల్ కేటగిరి పురుషులకు రూ.1300లు, మహిళలు, ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనారిటీలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు రూ.900లు. అడ్మిషన్ ఫీజు రాయితీ పొందేవారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ఆన్లైన్ అప్లికేషన్లో అప్లోడ్ చేయాలని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష ఫీజుల్లో రాయితీ ఉందని కావున విద్యార్థులు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని కోరారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE AT PUTTUR.
IA No. 1222/2023, IA No. 1221/2023 IA No1220/2023, O.S. No. 59/2016
BETWEEN:-
Bodithalupula Chittemma
...PETITIONER/PLAINTIFF
AND
Katarla Subramanyam Reddy and others
...RESPONDENTS/DEFENDANTS
NOTICES TO RESPONDENT'S NO.6 and 8
R6) G. Hemavathi, W/o Gurava Reddy, Hindu, aged about 30 years, Housewife.
R8) G. Kavya, W/o Dilli Babu, Hindu, aged about 24years, Housewife.
R 6 and R8 are residing at Pillarikuppam village, Marripalli Post, S.R.Puram Mandal, Chittoor Dist. **...Proposed Parties/Defendants No.6 and 8**
Please take notices that, the above case was filed by the plaintiff as against you and some others for permanent injunction in the above court and the same is posted on: 19.09.2024. Hence you are here by directed to attend before the above court at about 10-30 A.M. either by person or through Advocate. Otherwise the above case will be decided an exparty.
Hg. Date: 19.09.2024
G. Raja Reddy, B.Com, LL.B.
P. Kumarvel, B.Com, L.B.,
Advocates Puttur.

ఘనంగా సుబ్రమణ్యస్వామి ఉత్సవాలు

స్వామివారిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి - రామకుప్పం

రామకుప్పంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రమ్మణ్యస్వామి ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా వినాయకచవితి పండుగ అనంతరం వచ్చే ఐదు సోమవారాలు ఇక్కడ ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. గతంలో ఇక్కడ తోపు వంటి ప్రాంతంలో దేవాలయం ఉండగా నాగ పడిగా ఆకారంలో స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారని, అందుకే ఈ ఉత్సవాలను సుబ్రయని తోపు ఉత్సవాలను సోమవారాల్లో నిర్వహిస్తారు కాబట్టి సోమవారోత్సవాలు అని భక్తులు పిలుస్తారు. ముఖ్యంగా కులమతాలకు అతీతంగా ఇక్కడి ఆలయానికి హిందూ, ముస్లిం, క్రైస్తవులు కుటుంబాలతో సహా వస్తుంటారు. స్థానికంగానే కాకుండా సరిహద్దుల్లోని కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలనుండి సైతం భక్తులు తరలి వస్తారు. ఉత్సవాల సందర్భంగా ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ప్రాకరోత్సవాలు నిర్వహిస్తారు. ఇక్కడి సుబ్రమణ్య స్వామి ఆలయం సమీపంలోనే నాగాలమ్మ దేవాలయం, పద్మావతి అమ్మవారి ఆలయం, వేంకటేశ్వరస్వామి

కుటుంబంతో కలిసి పూజలో పాల్గొన్న ఎస్పీ మణికంట చండోలు , సుబ్మ్రణ్యస్వామి వారి దేవస్థానం

ఆలయం, శనీశ్వర దేవాలయం, వినాయక స్వామి ఆలయం ఉన్నాయి. కాగా నక్షత్ర వనం, త్రిమూర్తి వనం, రాశివనం ఇక్కడ ఉన్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ వారు నిత్య అన్నదానం చేస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందీ కలుగకుండా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమవారం చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చండోలు కుటుంబ సమేతంగా ఇక్కడి ఆలయానికి విచ్చేయగా.. ఆలయ కమిటీ వారు సదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలను అందజేశారు. అనంతరం వేలాదిగా ఇక్కడికి వచ్చే భక్తుల పర్యవేక్షణ కోసం ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన సీసీ కెమరాలను ఎస్పీ పరిశీలించారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట గ్రామానికి చెందిన డాక్టర బండి ప్రభాకర్ రెడ్డి రచించిన శ్రీకాళహస్తి– పాండురంగ మాహాత్మ్యాల తులనాత్మక పరిశీలన' (శివ–కేశవ లీలలు) పుస్తకాన్ని రచించారు. సోమవారం చిత్తూరులోని జిల్లా పరిషత్ సెమినార్ హాల్‌లో జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలఎని ఎం.గోవిందస్వామి నాయుడు మార్గదర్శకత్వంలో తాను పూర్తి చేసిన గ్రంథానికి ఈ అవార్డు రావడం గర్వంగా ఉందని సన్మాన గ్రహీత ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ తెలుగు రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పసపల హరికృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘుపతి ప్రభాకర్ రెడ్డికి తెలుగుభాషా సేవా పురస్కారాన్ని, ఉత్తమ భాషా ఉపాధ్యాయులుగా ప్రశంసా పత్రాన్ని అందించి సత్కరించారు.

సీసీ కెమెరాలపై అవగాహన

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని వ్యాపారస్తులకు సీసీ కెమెరాలపై పట్టణ సిఐ జిటి.నాయుడు అవగాహన కల్పించారు. సోమవారం పట్టణ పరిధిలోని సుజ్ఞానానంద ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో సిఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలను నియంత్రించవచ్చని, నేర విచారణలో సీసీ కెమెరాల వల్ల కలిగే లాభాలను వివరించారు. అదేవిధంగా సీసీ కెమెరాల నిర్వహణపై అవగాహన కల్పించారు. స్థానిక టిడిపి నాయకులు జిమ్ దాము, జాకీర్ అహ్మద్, సోము, మంజునాథ్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరిస్తాం

కడా పిడి వికాస్ మరమత్

ప్రజాశక్తి- కుప్పంటౌన్: ప్రజాసమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని కడా పిడి వికాస్ మరమత్ తెలిపారు. సోమవారం ఆయన కుప్పం మండల అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి 51 ఆర్జీలు అందుకున్నారు. ఇందులో 27 రెవెన్యూ సమస్యలపై రావడం జరిగిందని తెలిపారు.

వరద బాధితులకు విరాళం

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపు మేరకు విజయవాడ వరద బాధితుల సహాయార్థం తాము 3 రోజులు విరాళాల రూపంలో సేకరించిన రూ.46,100లను సోమవారం ఎంఎల్‌ఏ స్వగృహంలో ఎంఎల్‌ఏను కలిసి చిత్తూరు నగరానికి చెందిన గ్లామ్ స్టూడియోజ్ నిర్వహకులు, సిబ్బంది జీజేఎం పౌండేషన్‌కు అందజేశారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: జాతీయ పోషకాహార దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద మాట్లాడుతూ పోషకాహారం మానవ శరీరానికి ఎంతో ముఖ్యమని, ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు పోషకాహారం గురించి ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

16న రాయలసీమ సమగ్ర శిక్షా ఉద్యోగుల సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఈనెల 16న తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాయలసీమ సమగ్ర శిక్షా ఉద్యోగుల హక్కుల సాధన ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి. బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శులు జయచంద్ర, ఆర్.లక్ష్మి, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షుడు గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ హెచ్ ఆర్ పాలసీ, రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, సమ్మె జీతం, సమ్మె కాలపు అగ్రిమెంట్స్ అమలు కోరుతూ తదితర డిమాండ్ సాధన కోసం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైయస్సార్ కడప జిల్లాల రాయలసీమ ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ చైర్మన్ ఎ.వి. నాగేశ్వర రావు, రాష్ట్ర చైర్మన్ కాంతారావు హాజరు అవుతారు తెలిపారు.

'పక్కాగా ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పెషల్ సమ్మరీ రివిజన్ –2025లో భాగంగా ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య చెప్పారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ –2025లో భాగంగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన కార్యక్రమాల నిర్వహణపై చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్వోలు) ప్రత్యేక సమీక్ష సమావేశం సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం ఆయా తేదీల్లోగా పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా బిఎల్వో యాప్‌లో వివరాల నమోదు కోసం ఇంటింటి సర్వే క్షేత్రస్థాయిలో పక్కాగా చేయాలన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలోని వివరాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి యాప్‌లో నమోదు చేయాలన్నారు. జాబితాలో నాణ్యమైన ఫోటోలే ఉండేలా చూడాలని, ఓటర్ల స్థానంలో ఇతర ఫోటోలు ఉంటే సత్వరం గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సహాయ కమిషన ఎ.ప్రసాద్ మాట్లాడుతూ.. బీఎల్వోలు ఇంటింటి సర్వేను ఈనెల 21వ తేదీ లోపల పూర్తి చేయాలని, ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కళావతి, ఈ–డీటీ హిమగిరి, ఏఎస్వో సౌందర్ రాజన్, మేనేజర్ గోపాలకష్ణ వర్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ చిన్నయ్య

9,10 తేదీల్లో 'మెంటల్ హెల్త్ మ్యాటర్స్ అట్ వర్క్'పై చర్చ

పోస్టర్లును ఆవిష్కరిస్తున్న అపోలో వైద్యనిపుణులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 9,10 రెండు రోజులపాటు చిత్తూరు నగరంలోని ముర్కంబట్టు అపోలో యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా మెంటల్ హెల్త్ మ్యాటర్స్ అట్ వర్క్ అనే అంశం పైన చర్చ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్‌ఛాన్సర్ డాక్టర్ వినోద్ భట్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం అపోలో యూనివర్సిటీలో దీనికి సంబంధించిన బ్రోచర్ను ఆయన విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీనికి సంబంధించి అక్టోబర్ 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఫ్రీ కాన్ఫరెన్స్ ఈవెంట్స్‌లో భాగంగా అవగాహన ర్యాలీతో పాటు, మూడు రోజులు సైకాలజీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 9,10 తేదీల్లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు ముఖ్యవక్తలుగా కెనడా నుంచి మధు భరద్వాజ్, ఆఫ్రికా నుంచి డాక్టర్ సంద్రా జుంబే, నేపాల్ నుండి డాక్టర్ నరేంద్ర సింగ్ తగుణ, మరి కొంతమంది వక్తలు పాల్గొంటారని వెల్లడించారు. 10వ తేదీ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో దేశంలోని స్కాలర్లు, విద్యార్థులు, ప్రముఖ వైద్యులు, వక్తలు, ఆచార్యులు, అధ్యాపకులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.పోతరాజు, డీన్ డాక్టర్ కే.భాస్కర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.హసీనా, జాయింట్ సెక్రటరీ డాక్టర్ పి.సుధ, కోఆర్డినేటర్లు డాక్టర్ కబిలాన్ అన్నాదురై, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం జోలికి వస్తే ఊరుకోం..

మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం

ప్రజాశక్తి - సదుం: కలకటవారిపల్లి దళితువాడలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తొలగిస్తే ఊరుకునేది లేదని మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమాల సుదర్శనం అన్నారు. సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలకటవారిపల్లి దళితవాడలోని రామాలయం గుడి ఎదుట ఇదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఎస్‌ఏ విశ్రాంత ఉద్యోగి ఎస్.ఎర్రయ్య డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రూ.2.5లక్షల ఖర్చుతో ఏర్పాటు చేశారన్నారు. రామాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు గిట్టని ఇదే గ్రామానికి చెందిన గొర్రెపర్తి ప్రభాకర్, ఇప్పర్ల సురేష్ అంబేద్కర్ విగ్రహం రామాలయ గుడి ముందర వద్దని, ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించాలని కుట్ర చేస్తున్నారన్నారు. వారి వ్యక్తిగత మనోభావాలు దెబ్బతింటాయని విగ్రహ ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ చర్యను ప్రభాకర్, సురేష్ మానుకోకపోతే మాల మహానాడు ఆధ్వర్యంలో గట్టిగా వారికి బుద్ధి చెప్తామన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వారి కార్యాలయంలోని ఏఎస్‌ఓ జి.విజయ్ కుమార్, ఎస్సై షేక్ షావలిని కలిసి ప్రభాకర్, సురేష్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుచేశారు. నాయకులు యమల చంద్రయ్య, ఎన్ఆర్.అశోక్, శివయ్య, శ్రీరాములు, కృష్ణమూర్తి, కృపాపాని రాము, ఈశ్వర్, రెడ్డి ప్రసాద్, ముకుంద, విజయ్, సురేష్, మల్లేపల్లి శ్రీనివాసులు, కృష్ణయ్య, పెద్దరెడ్డప్ప పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించండి

విశ్వవిద్యాలయ సిబ్బందికి వేతనాలు అందించండి
కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ గోవిందరాజులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గం ద్రావిడ విశ్వవిద్యాలయ తాత్కాలిక సిబ్బందికి బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని, దురాక్రమనకు గురైన వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాలని కాంగ్రెస్ పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్చార్జ్ గోవిందరాజులు కోరారు. సోమవారం కుప్పం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలో గత 13నెలలుగా తాత్కాలిక సిబ్బందికి వేతనాలు లేకపోవడంతో మనస్థాపానికి గురైన రామకృష్ణ ఆత్మహత్యకు ప్రయత్నించడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితున్ని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి విశ్వవిద్యాలయ తాత్కాలిక సిబ్బందికి వెంటనే జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో సుమారు 16 ఎకరాల వక్ఫ్ బోర్డు భూములు ఉన్నట్టు కుప్పం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిజాం తెలిపారు. ఈ భూములు చాలావరకు దురాక్రమణలో ఉన్నట్టు ఆరోపించారు. కావున వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, వక్ఫ్ బోర్డు భూములను సర్వే చేయించి, వాటిని వక్ఫ్ బోర్డు ప్రతినిధులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ మునస్వామి, నియోజకవర్గ ఎస్సీసెల్ ఇంచార్జ్ నాగరాజు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఆర్ఎంపీలు ప్రజలు వస్తే ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని తూగుండ్రం పిహెచ్‌సి వైద్యాధికారిని డాక్టర్ మౌనిక తెలిపారు. సోమవారం తూగుండ్రం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్లను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ప్రథమ చికిత్స చేసి వారిని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. అలాకాకుండా వారికి ఇంజక్షన్ ఇచ్చి మందులు ఇవ్వడం, రక్త పరీక్ష చేయడం వంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆర్ఎంపీ డాక్టర్లకు నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణమ్మ, రాజు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు నోటీసులు ఇస్తున్న డాక్టర్ మౌనిక

రెండు టన్నుల కూరగాయలు వితరణ

ప్రజాశక్తి- శాంతిపురం: కాణిపాకం వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాల సందర్భంగా సుమారు రెండు టన్నుల కూరగాయలను శాంతిపురం మండలం జిల్లా పరిషత్ సభ్యులు శ్రీనివాసులు వారి మిత్ర బృందం కాణిపాకం ఆలయ నిర్వాహకులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంభువు వరసిద్ధి వినాయకుడి దేవస్థానానికి కూరగాయలను అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయన తన మిత్రబృందం కుటుంబసభ్యులతో కలిసి వినాయకుడిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు, మిత్రులు పగడాల సురేష్, బాబు రెడ్డి, సుధాకర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, పాల్గొన్నారు.

అంటువ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి -రామకుప్పం: మండలంలో అంటువ్యాధులు ప్రబలకుండా సర్పంచులు, ఎంపీటీసీలు, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు ప్రజలకు వైద్యసేవలు అందించాలని టిడిపి మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, రాష్ట్రనేత మునస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు చికెన్ గున్యా, మలేరియా, డెంగీ, సాధారణ జబ్బులకు వైద్య శిబిరాలు నిర్వహించి ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య విషయంలో పర్యవేక్షించాలన్నారు. గృహాల పరిసర ప్రాంతాల్లో శుభ్రత పాటించాలని, డ్రైనేజీల్లో చెత్తాచెదారం నిర్వహించకుండా.. ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరన్న, నేతలు చిన్నకృష్ణ,రమేష్ బాబు, జెయి,రఫీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యపరీక్షలు తప్పక చేయించుకోవాలి

ప్రజాశక్తి- సోమల: గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవానంతరం వరకు గర్భవతులు వైద్యుల సూచనలు సలహాలు పాటిస్తూ క్రమం తప్పక వైద్యపరీక్షలు చేయించుకోవాలని పెద్ద ఉప్పరపల్లి వైద్యాధికారిణి సోనియా కోరారు. పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా దాదాపు 24మంది గర్భవతులను వైద్యశాలలో పరీక్షలు నిర్వహించారు. గర్భం దాల్చినప్పటి నుండి పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యుల సలహాలు పాటిస్తూ సుఖప్రసవం కోసం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి ప్రసవం చేయించుకోవాలని 108 104 వాహనాలను తప్పక ఉపయోగించుకోవాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రమైన సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని దిడ్డివారిపల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్యాధికారి బాలాజీ ఆధ్వర్యంలో గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

కమీషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు త్వరలో ప్రారంభిస్తామని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. కమిషనర్ వార్డుబాట కార్యక్రమంలో భాగంగా ఆయన పట్టణ పరిధిలోని నాలుగవ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై ప్రజల నుండి అర్జీలు అందుకున్నట్టు తెలిపారు. వీటిలో ఎక్కువ భాగం సంక్షేమ పథకాలకు సంబంధించిన అర్జీలు వచ్చినట్టు తెలిపారు. వాటన్నింటినీ పరిశీలించి వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలమనేరు పెన్షనర్స్ సంఘ సభ్యులకు డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి వారిచే సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షులు రత్నారెడ్డి, ఉపాధ్యక్షులు గురుమూర్తి మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని తెలిపారు. డాక్టర్ వంశీధర్, డాక్టర్ ఇమ్మానుయేల్, డాక్టర ఎల్.రాజు, కావ్యశేఖర్ 80 మంది కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. అలాగే కంటి సమస్యలున్న వారికి డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు.

సమావేశం వాయిదా

ప్రజాశక్తి- గుడిపల్లి: మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసిన మొత్తం మండలంలో 13 మంది ఎంపీటీసీలు ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే రావడంతో ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్లు మండల ఎంపీడీవో తాజ్ మసురు తెలిపారు. దీంతో అన్ని శాఖ అధికారులు సమావేశం నుండి వెను తిరిగారు. తదుపరి సమావేశం తేదీని తెలియపరుస్తామన్నారు.

ఎంపీటీసీలు సమావేశానికి రాకపోవడంతో ఖాళీగా కుర్చీలు

కంటి వైద్య శిబిరానికి 25మంది ఎంపిక

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: కంటి వైద్య శిబిరానికి 25 మంది ఎంపికైనట్టు శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ నిర్వాహకులు మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలున్న 55 మంది కంటి పరీక్షలు చేసుకోగా అందులో 25మంది కంటి పరీక్షలకు ఎంపికయ్యారని వీరికి చెన్నై శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేసి కంటికి లెన్స్‌లో అమర్చినట్టు వీరికి పోను రాను ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ప్రతినెలా రెండవ సోమవారం మండల కార్యాలయంలో వైద్యశిబిరం నిర్వచిస్తామని కంటి పరీక్షలను ఉచితంగా చేసుకొని కండ్లను సంరక్షించుకోవాలని అన్నారు. టెక్నీషియన్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.